'ఇంత నీచంగా చూస్తే బాబయ్యతో మాట్లాడడం యిదే ఆఖరుసారి. ఎంత బీదవాణ్ణైనా ఆత్మగౌరవం ఉండాలి' అని నిశ్చయించుకున్నాడు రామం. అతని నిశ్చయానికి జేజే ధ్వనులు కొడుతున్నట్లు పెద్దపెద్ద కూతలు కూసుకుంటూ స్టీమరు గోదావరినీళ్ళను చీల్చుకుంటూ రివ్వున పరుగెత్తింది.

* * * *

అమలాపురం వెళ్ళి పెదమామయ్యకు అమ్మ యివ్వమన్న డబ్బుయిచ్చి, ఇతర కుటుంబవిషయాలు మాట్లాడి, పని ముగించుకుని, రామం తిరుగుదారిలో రాజమండ్రి చేరుకున్నాడు. ఈసారి బాబయ్యగారి యింటికి వెళ్ళకూడదని నిశ్చయించి, హోటలుకు బయలుదేరాడు భోజనం చేద్దామని.

దారిలో సగందూరం వచ్చేటప్పటికి, పక్కవీధినుంచి యిద్దరు ఆడమనుష్యులు, యిద్దరు పిల్లలు కలిసి తనకు ఎదురుగా వస్తూండడం రామం చూశాడు. యింకెవరు? అత్తయ్య, పిన్నమ్మ, చంటి, రత్తప్ప! రామానికి సత్తెమ్మత్తయ్యతో మాట్లాడా లనిపించింది. అత్తయ్య చాలామంచిది. కాని పిన్నమ్మకూడా పక్కనవుంది. తీరా పలుకరిస్తే వాళ్ళుకూడా 'ఎవరు నువ్వు' అంటే? రామంకు ఆత్మాభిమానం వెన్నంటింది. వీళ్ళందరిచేత యింత నీచంగా చూడబడేదానికంటే మాట్లాడకుండా పోవడం మంచిదని నిశ్చయించుకున్నాడు.

'అదేమిటిరా. యీవేళే యింటికి పోతావు, ఒక్క-పూటైనా మా యింట్లో ఉండకుండా' అంది సత్తెమ్మగారు.

'ఎందుకులే. నాకు యింటిదగ్గర పనుంది. వెళ్ళిపోవాలి' అన్నాడు రామం.

'రామం! నామాట విను. ఒక్క పూట యిక్కడవుండి యింటికెళ్ళుదువుగాని' అని సత్తెమ్మగారు బలవంతపెట్టింది.

రత్తప్ప, చంటి, రామంచుట్టూ మూగి, 'యీవేళకు ఆగు అగు. రామం అన్నయ్యా' అనడం మొదలెట్టారు.

'ఆగరా రామం! మొన్న గోదావరిఒడ్డున నువ్వు కనిపించావట కదూ! మీ బాబయ్య సరిగా గుర్తుపట్టలేక పోయారుట. యింటికివచ్చి నువ్వే అయివుంటావని, ఎంతో నొచ్చుకున్నారు. ఒకసారి యింటికి రారా' అంది రామం పిన్నమ్మ, అందరూ రమ్మని బలవంత పెడుతూంటే తను ఊరుకోడం మర్యాద లోపమవుతుందని భయపడి.

పిన్ని యీమాట అనగానే, బాబయ్య నిజంగా పొరబాటున గుర్తుపట్టలేదేమో అనుకున్నాడు రామం. అయినా యింత చిన్నవిషయం గురించి యింటికి వెళ్ళకపోవడం బాగుండదనుకున్నాడు. రత్తప్ప, చంటి తన్ను రమ్మని పట్టుకు పీకుతూంటే, వాళ్ళకోసమైనా యింటికి వెళ్ళి వాళ్ళతో కాసేపు ఆడుకోవాలనిపించింది రామంకు. సత్తెమ్మత్తయ్య రారా అని బ్రతిమాలుతోంది. 'అత్తయ్య చాలా మంచిది. అత్తయ్య మాట వినాలి' అనుకున్నాడు రామం. వాళ్ళందరితో కలిసి వెంకటాద్రియ్యగారింటికి వెళ్ళాడు ఆఖరుకు.

